క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు వెంకటరమణ

సిద్దవటం : మండలంలోని భాకరాపేట జెడ్పీ హెచ్ఎస్‌లో ఆదివారం స్థానిక గ్రామ సర్పంచ్ తర్రా చిన్నక్క ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతిలోని రమాదేవి మల్టీ స్పెషాలిటీ వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకేశమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు పూజలు


బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో వున్న మహిమగల రాయికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని అడవి కమ్మపల్లెకు చెందిన దాతలు సత్యనారాయణ, సుశీల దంపతులు అమ్మవారికి 8 గ్రాముల బంగారు ఆభరణాన్ని బహూకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

నాగారపమ్మ ఆలయంలో..


అలంకరణలో నాగారపమ్మ


సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మకు తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


శ్రీవైష్ణవికి పతకం అందజేస్తున్న నిర్వాహకులు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీమద్భగవద్గీత 12వ అధ్యాయం, భక్తి యోగంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. పోటీలకు దాదాపు 50 మందికి పైగా పాల్గొన్నారు. పోటీల్లో బొడిచెర్ల శ్రీవైష్ణవి ప్రథమ స్థానం, గోర్ల గౌతమీప్రియ ద్వితీయ స్థానం, సునంద, కావ్య సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీమద్భగవద్గీత అధ్యాత్మిక వేత్త సుబ్బారెడ్డి, విష్ణు సహస్రనామ పారాయణం సంఘ సభ్యులు రాఘవేంద్రం, చంద్రశేఖర్, రిటైర్డ్ తహసీల్దారు జయన్న, ఉపాధ్యాయురాలు రూప తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ కృషి


నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట టౌన్ : జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకను రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఏక్‌దేశ్‌మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహి చెలెంగా అని నినదించి సమైక్య భారత్ కోసం పోరాటం చేసిన గొప్ప దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, హిమగిరియాదవ్, వేణుప్రసాద్‌రాజు, రమణారెడ్డి, తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జీవితంలో చంద్రబాబు..

ప్రజలకు చేసిందేమీలేదు

- నేడు రైల్వేకోడూరులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం
- రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై దిశానిర్దేశం
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు


సమావేశం అనంతరం నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి చంద్రబాబు నలభై సంవత్సరాల రాజకీయ జీవితంలో ప్రజలకు చేసింది ఏమీలేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. ఆదివారం కొర్లకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిశోర్‌రెడ్డి నివాసంలో నియోజవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యా అని మండిపడ్డారు. అనేక హామీలతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది పూర్తయిన హామీల అమలు చేయడంలేదన్నారు. ఇప్పుడు అన్ని చేసేశామని, చేసేందుకు ఏమీ లేవని ప్రజలను చంద్రబాబు మోసగిస్తున్నారని మండిపడ్డారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కొండూరు అజయ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి పార్టీల సూపర్ సిక్స్ హామీలను నమ్మిన ప్రజలు పట్టం కట్టారని, పథకాల అమలులో విఫలం కావడంతో ఏడాదిలోనే వ్యతిరేకత మూటకట్టుకున్నారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజలకు చేసింది ఏమీ లేదని ఇప్పుడు సుపరిపాలన – తొలి అడుగు పేరుతో ఇంటింటికి ఏ ముఖం పెట్టుకుని వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం సాయికిశోర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రైల్వేకోడూరులోని ఎస్ఎస్‌బీ కన్వెన్షన్‌లో జరిగే 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంపై జరిగే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. అనంతరం సాయి కిశోర్‌రెడ్డి నాయకులకు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైఎస్సార్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారెడ్డి, రైల్వేకోడూరు అధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, చిట్వేలి అధ్యక్షులు చెవ్వు శ్రీనివాసులరెడ్డి, రైల్వేకోడూరు ఉప సర్పంచ్ శివసాయి, మాజీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, సర్పంచ్‌లు ఎన్‌పీ జయపాల్‌రెడ్డి, పోలి పాపిరెడ్డి, జరుగు నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు అక్కిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, ఆర్‌వీ రమణ, మలిశెట్టి వెంకటరమణ, యువ నాయకులు అమరేశ్వర్‌రెడ్డి, తుంగా గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీలు వత్తలూరు రోషిణీకుమార్‌రెడ్డి, పైడి గిరినాయుడు, రమేష్‌రాజు, దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్‌రెడ్డి, పిచ్చన్న కోటి నాయుడు, పాముూరు దీపక్‌రెడ్డి, బండారు రమణ, పసుపులేటి సుబ్బరాయుడు, కొమ్మూరు నారాయణరెడ్డి, దుర్గారెడ్డి, సుకుమార్, ప్రేమ్, కో-ఆప్షన్‌మెంబర్ షేక్ మౌల, వడ్డి చెంగల్‌రెడ్డి, ప్రతాప్, గల్లా శ్రీనివాసులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నిర్లక్ష్యంతో విద్యారంగం నిర్వీర్యం

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 10వ తేదీ విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర్ తెలిపారు. పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం నాగేశ్వర్ చేతులమీదుగా మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ నిర్వీర్యమైందని ఆరోపించారు. రాష్ట్రంలో పాఠశాలల విలీన ప్రక్రియ వల్ల వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీఓ నెంబర్ 77 వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు పీజీ విద్యకు దూరం అవుతున్నారన్నారు. తల్లికి వందనం పథకానికి అనేక నిబంధనలు పెట్టడంతో లక్షలాది మంది తల్లులు పథకానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేక సంక్షేమ హాస్టల్స్‌లో కనీస సౌకర్యాలు లేక సంక్షోభ హాస్టల్స్‌గా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక హాస్టల్స్‌లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై అనారోగ్యం పాలవుతున్నారని, అయినప్పటికీ విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. మంత్రి పట్టించుకోకపోవడం వల్లే ఫుడ్ పాయిజన్ సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వెంకటరమణ, బబ్లు, కిషోర్, తరుణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : బీజేపీ ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న చట్టాలు, హక్కులను కాలరాస్తోందని బీజేపీ చేస్తున్న కార్మిక కర్షకోద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జూలై 9న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, కర్షక శ్రేణులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులను సంఘటితం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్మికులు ప్రాణత్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమ దోపిడీని దోచుకుతినే విధంగా చట్టాలను మారుస్తున్నారని ఇది ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని తెలిపారు. అనంతరం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను వివిధ కార్మిక సంఘాల నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏవీ రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణ, అంగన్వాడీ నాయకులు సిద్దమ్మ, మంజుల, బీడీ సంఘం నసీబ్‌జాన్, ఆశ నాయకులు సునీత, శైలజ, మధ్యాహ్న భోజన కార్మికులు జయన్న, ఫర్హానా, హమాలీ నాయకులు మాధవ, రత్నం, మున్సిపల్ నాయకులు అక్బర్, నాగేశ్వరనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ నాయకులు దేవరాయలు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలను ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా వేంకటేశ్వర స్వామి, రామాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారికి ఉభయాలు సమర్పించారు. ఆయా ఆలయాల పురోహితులు విశేషంగా పూజలు చేపట్టారు. అలాగే భక్తులు విష్ణు, సహస్ర నామాలు, పారాయణం చేసి, గోవిందనామ స్మరణ చేశారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ఆలయాలకు తరలి రావడంతో అన్ని ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తొలి ఏకాదశి కావడంతో అనేక మంది ప్రజలు ఆదివారం అయినప్పటికి మాంసాహారాలకు దూరంగా ఉన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


సుండుపల్లె: తొలి ఏకాదశి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


సంబేపల్లె: మోటకట్లలో పూజలందుకొంటున్న వేంకటేశ్వరుడు


సిద్దవటం: మాధవరంలో వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


రాజంపేట టౌన్: కూచివారిపల్లె రామాలయంలో భక్తుల పూజలు


రైల్వేకోడూరు అర్బన్: ప్రత్యేక అలంకరణలో భుజంగేశ్వరుడు

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి


నందలూరు: శునకానికి టీకా వేస్తున్న పశువైద్యులు


రాజంపేట రూరల్: ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు జంతువులకు టీకాలు

నందలూరు : పెంపుడు జంతువులకు విధిగా టీకాలు వేయించాలని పశువైద్యులు ఈశ్వర్‌ప్రసాద్ తెలిపారు. జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. ఈసందర్భంగా ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని తెలిపారు. ఈ వ్యాధులు దాదాపు 280 వరకు గుర్తించబడ్డాయన్నారు. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త తొలిసారి 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలునికి వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా విజయవంతంగా ఇచ్చినందున ప్రతి ఏటా జూలై 6వ తేదీ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవీఓ సుగుణ, వీఏ.సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్ఎజాహ్నవి, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు బాబు జగ్జీవన్ రామ్


రైల్వేకోడూరు అర్బన్: జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కొరముట్ల, నాయకులు


రాయచోటి: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని చిత్రపటానికి నాయకుల నివాళి

రాయచోటి : మాజీ ఉప ప్రధాని, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన బాబు జగ్జీవన్ రామ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా రాయచోటిలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఉప ప్రధానిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ అంకే ఆంజనేయులు, ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు చంద్ర నాయక్, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ వెంకటరమణ, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు దొరబాబు, నియోజకవర్గ వాలంటరీ విభాగం అధ్యక్షులు సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : దేశ స్వాతంత్ర్యంలో ముందుండి నడవడమే కాకుండా దళితుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నతుడు బాబు జగ్జీవన్ రామ్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా కోడూరులోని ఆ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఆయన ఎంచుకున్న అడుగుజాడలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచి వారి శ్రేయస్సుకు ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, సర్పంచ్ బుడుగు శివయ్య, డీవీ రమణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి జాతరలు


రాజంపేట టౌన్: ప్రత్యేక అలంకరణలో మాతమ్మ

ఓబులవారిపల్లె : మంగంపేట కట్టా పుట్టాలమ్మ జాతర ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే గ్రామ దేవతగా కట్టా పుట్టాలమ్మ ప్రసిద్ధి. జాతర సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగుబాళ్లు సమర్పించి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అంతకుముందు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓరుగంటి నవీన్, ఓరుగంటి అనిల్, వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ అధ్యక్షులు భరత్ కుమార్ రెడ్డి, పోకూరు మురళీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ జాతర

రాజంపేట టౌన్ : పట్టణంలోని సాతపల్లెలో ఆదివారం మాతమ్మ జాతరను ఆ గ్రామ ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి పొంగళ్లు పెట్టుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను పెద్దఎత్తున సమర్పించారు. ఆలయంలో కొలువుదీరిన అమ్మవారి మూలవిరాట్‌ను భక్తులు ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని తప్పెట్ల దరువు, బ్యాండు వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. జాతరలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



లక్కిరెడ్డిపల్లె : మండల పరిధిలోని అప్పకొండయ్యగారిపల్లి పంచాయతీ హరిజనవాడకు చెందిన జానకోళ్ల ఓబులేశ్వరి కూతురు జానకోళ్ల అఖిల కలికి వైఎస్సార్ యూనివర్సిటీలో హార్టికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే అఖిల కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో డైరెక్టర్ రాజారెడ్డిని సంప్రదించగా వెంటనే మానవతా చైర్మన్ బాల సుబ్రమణ్యం, కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షులు షఫీ, నాయక్‌లతో చర్చించి ఆమెకు ఆర్థిక సాయంగా దాత మానవత సభ్యులు, అనంతపురం జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య అఖిలకు రూ. 10 వేలు అందజేశారు.

జల్దికి సాగిన పీర్లు

పది రోజుల నుంచి వైభవంగా జరుగుతున్న పీర్ల పండుగ ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు సందర్భంగా భక్తులు పీర్ల చావిడి వద్ద చదివిందులు చదివించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లాలోనే ప్రఖ్యాతి గాంచిన చిన్నమండెంలో శనివారం రాత్రి ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గంధపు పీరును దర్శించారు. కాగా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప పెద్ద దర్గా పీఠాధిపతులు గంధపు పీరుకు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అలానే రాజంపేట రూరల్ మండలం పెద్దూరుకు చెందిన పీర్లు ఆకేపాటి ఎస్టేట్‌కు చేరుకోగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కుటుంబసభ్యులు చదివింపులు చదివించి.. భక్తులకు భోజన వసతిని కల్పించి, వడ్డించారు. అనంతరం పీర్లను జల్దికి పంపే కార్యక్రమాన్ని ఉత్సవ నిర్వాహకులు వేడుకగా నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్


రామాపురం మండలంలో అగ్ని గుండం ప్రవేశం చేస్తున్న పీర్లు


వీరబల్లి: భక్తులకు అన్నదానం చేస్తున్న కుళ్లాయిరెడ్డి


చిన్నమండెం: పీర్లకు భక్తుల చదివింపులు


చిన్నమండెం: గంధపు పీరుకు ప్రార్థనలు చేస్తున్న కడప పెద్ద దర్గా పీఠాధిపతి, మతపెద్దలు


రాజంపేట టౌన్: పీర్లను ఊరేగిస్తున్న యువకులు


రాజంపేట రూరల్: పీర్లకు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి చదివింపులు

ఘనంగా ముగిసిన ఆలయ వార్షికోత్సవం


మారెమ్మ ఊంజల్ సేవలో భక్తులు

లక్కిరెడ్డిపల్లె : మారెమ్మా కరుణించి కాపాడమ్మా అంటూ గ్రామస్తులు, భక్తులు అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ మారెమ్మ దేవత ఏడవ వార్షికోత్సవ కార్యక్రమానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మండలంలోని మద్దిరేవుల గ్రామం వంకగడ్డరాచపల్లె సమీపంలో వెలసిన శ్రీ మారెమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భాజా భజంత్రీలు, బ్యాండు మేళాలతో ఊంజల్ సేవ, హోమాలను జరిపారు.